ముక్కు ద్వారా మెదడులో కణితుల తొలగింపు సులభం



- నూతన సాంకేతికతతో శస్త్రచికిత్సలు
- కామినేని ఆస్పత్రిలో రెండు రోజుల సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: మెదడులో కణితులను సులువుగా తొలగించేందుకు నూతన సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ఎండోస్కోపిక్ స్కల్ బేస్ సర్జరీ ద్వారా ఈ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. నూతన సాంకేతికతపై రెండు తెలుగు రాష్ట్రాల్లోని వైద్యులకు అవగాహన కల్పించేందుకు కామినేని ఆస్పత్రిలో రెండు రోజుల పాటు కెడావరిక్ వర్క్ షాప్ నిర్వహించారు. న్యూరో ఎండోస్కోపీ సర్జరీ గురించి వైద్యులు చర్చించుకున్నారు. దేశ వ్యాప్తంగా 120 మందికి పైగా వైద్యులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఢిల్లీ, ఛండీగఢ్ పీజీఐలు, నిమ్‌హాన్స్, ఎయిమ్స్ లాంటి ప్రఖ్యాత ఆస్పత్రులకు చెందిన ప్రొఫెసర్లు హాజరయ్యారు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి స్కల్ బేస్ డైరెక్టర్లు జూమ్ మీటింగ్ ద్వారా హాజరయ్యారు. మెదడు మధ్య భాగంలో ఉండే కణితులను తొలగించాలంటే ముందుగా కపాలం పగలగొట్టి, కణితిని తొలగించాల్సి ఉంటుంది. ముక్కు ద్వారా అయితే చాలా సులభంగా కణితి ఉన్న ప్రాంతానికి చేరుకోవచ్చు. 2 సెం.మీ. మేర మాత్రమే కట్‌చేస్తే సరిపోతుంది. పిట్యుటరీ ట్యూమర్లు, స్కల్ బేస్ ట్యూమర్ల చికిత్స కోసం దీన్ని వాడుతారు. ఇలాంటి శస్త్రచికిత్స కోసం ఒకప్పుడు బెంగళూరు నిమ్‌హాన్స్, ఢిల్లీ ఎయిమ్స్ లాంటి ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ సాంకేతిక హైదరాబాద్‌లో కూడా అందుబాటులోకి వచ్చింది' అని సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించిన డాక్టర్ శిఘాకొల్లి రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ జలీల్, కోశాధికారి డాక్టర్ అరుముళ్ల శివసాయి, కామినేని ఆస్పత్రి సీవోవో డాక్టర్ గాయత్రి కామినేని, లక్నో ఎస్‌జీపీజీఐ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరో సర్జరీ డాక్టర్ అవదేశ్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సివరేజ్‌లైన్‌ను మట్టితో కప్పేశారు

- స్థానికుల సమాచారంతో మరమ్మతులు
- భవన యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ఔట్‌లెట్ మూసివేతతో పొంగి పొర్లుతున్న డ్రైనేజీ



సివరెజ్ ఔట్‌లేట్‌కు అడ్డంగా కాంక్రీట్ గోడ కట్టడంతో పాటు మట్టితో మూసిన దృశ్యం

లింగోజిగూడ: కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్ ప్రధాన రహదారిలో డ్రైనేజీ మ్యాన్ హోల్‌లు నిత్యం పొంగి పొర్లుతున్నాయి. 5 రోజులుగా జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. తాత్కాలికంగా సమస్య పరిష్కారం చేసినా ప్రధాన కారణం తెలియక మల్లాగుల్లాలు పడ్డారు. ఎట్టకేలకు శనివారం స్థానికుల సాయంతో ప్రధాన కారణం తెలుసుకుని సమస్యను పూర్తి స్థాయి పరిష్కారం దిశగా చర్యలు చేపట్టారు.

సెల్లార్‌లోకి నీరు వస్తోందని..

సెల్లర్‌లోకి నీరు వస్తుందని తపోవన్ కాలనీ వద్ద సరూర్‌నగర్ చెరువులోకి వెళ్లే బాక్స్ డ్రెయిన్‌లో కలిపే సుమారు నాలుగు ఫీట్ల సివరేజ్ లైన్‌ను మూసివేసి పూర్తిగా మట్టితో కప్పివేశారు. దీంతో డ్రైనేజీ పొంగిపొర్లుతుంది. సివరేజ్ లైన్‌ను మట్టితో కప్పిన విషయం గురించి స్థానికులు అధికారులకు తెలియజేశారు. సివరేజ్‌లైన్‌ను మట్టితో కప్పిన భవనం ఎదుట అధికారులు తవ్వకాలు చేపట్టారు. సివరేజ్ పైప్‌లైన్‌ను పూర్తి స్థాయిలో పగులగొట్టి మూసివేసి ఉండటంతో అధికారులు మరమ్మతులకు చర్యలు చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకుండా భవనం సెల్లార్ నిర్మాణం చేపట్టడంతో పాటు ప్రజలకు ఇబ్బందులకు గురిచేసిన ఇంటి యజమానిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జలమండలి అధికారుల సహకారంతోనే ఇదంతా జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

> **చర్యలు తీసుకోవాలి**
>
> అధికారులకు సమాచారం ఇవ్వకుండా తన స్వార్థం కోసం సివరేజ్ లైన్‌ను మూసివేసిన భవన యజమానిపై చర్యలు తీసుకోవాలి. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు ఎప్పటికప్పుడు సివరేజ్‌లైన్‌ను పర్యవేక్షించాలి.
>
> – కందికంటి శ్రీధర్‌గౌడ్, సరూర్‌నగర్

26న మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

చాదర్‌ఘాట్: ఈనెల 26న శిల్పకళా వేదికలో జరిగే అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖ డైరెక్టర్ బి.శైలజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యమంత్రి, మంత్రులు హాజరుకానున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

చెట్లను పరిరక్షించాలి

హస్తినాపురం: నాగార్జున సాగర్ రహదారిని ఆనుకుని ఉన్న కాలనీల్లో పెరిగి పెద్దదైన చెట్లను నరికివేయడంతో పర్యావరణానికి ఎంతో నష్టం జరుగుతుందని, అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి చెట్లను పరిరక్షించాల్సిన అవసరం ఉందని టీచర్స్ కాలనీ చెట్ల పరిరక్షణ కమిటీ కోఆర్డినేటర్ సన్నీ హెరాక్లియస్ అన్నారు. ఈ మేరకు శనివారం అటవీశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు. రోజురోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ పెరిగిన చెట్లను కాపాడుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చొరవ చూపాలన్నారు.

నిధుల కోసం కేంద్ర మంత్రికి వినతి



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రాజేశ్వర్‌యాదవ్

చంచల్‌గూడ: జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా రూ. 5 వేల కోట్ల నిధులు కేటాయించి బీసీలకు రుణాలివ్వాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు ఏ. రాజేశ్వర్‌యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. పార్లమెంట్, అసెంబ్లీలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కేటాయించాలని, అదే విధంగా ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ కార్పొరేషన్ పదవుల్లో బీసీలకు 50 శాతం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సత్యనారాయణ, భాస్కర్, జగదీశ్, రవి, సాయి, రాహుల్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతివేగం.. నిర్లక్ష్యంతోనే రోడ్డు ప్రమాదాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు

ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు

మన్సూరాబాద్: అతివేగం, నిర్లక్ష్యంతో వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు అన్నారు. శ్రీనివాస టూర్స్ అండ్ ట్రావెల్స్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ట్రాఫిక్ సేఫ్టీ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో డ్రైవర్లకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజల ప్రాణాలను రక్షించడంలో డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు. మన కుటుంబం, మన బాధ్యతగా ప్రతి డ్రైవర్ ఆలోచించి బాధ్యతగా డ్రైవింగ్ చేయాలని కోరారు. రోడ్డు భద్రతా ప్రమాణాలు, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంవీఐ అనూష, శ్రీనివాస ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కోటి శ్రీనివాసరావు, సావిత్రి, శివ, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం: రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని, అధికారులు ఎప్పటికప్పుడు పనుల నాణ్యతను పర్యవేక్షించాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీలో సీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రజ్ఞతో కలిసి పరిశీలించారు. రోడ్డు తవ్వకాలతో ఇబ్బందులు పడుతున్నామని, త్వరితగతిన రోడ్డును పూర్తి చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ.. సన్మానం

లింగోజిగూడ: సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–2024 సంవత్సరంలో 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన ఆరుగురిని సన్మానించారు. శనివారం రామోజు వీరమ్మ బ్రహ్మాచారి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో సన్మానించిన అనంతరం వారికి రూ.2 వేల నగదు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు సధ్గుణ చారి, కార్యదర్శి పవన్‌కుమార్, కోశాధికారి అరవింద్‌కమార్, హెచ్‌ఎం ఉమాదేవి పాల్గొన్నారు.



కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నేతలు



నాగోలు: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కిషన్‌రెడ్డిని శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇతర నాయకులతో కలిసి సన్మానించారు. కేంద్ర మంత్రికి జ్ఞాపికను అందజేశారు.

నియామకం



శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న గంజి రాజమౌళిగుప్తా, ఉప్పల శ్రీనివాస్ గుప్తా

వనస్థలిపురం: అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ రాష్ట్ర విభాగం పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్‌గా వనస్థలిపురానికి చెందిన భావన శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐవీఎఫ్ జాతీయ అధ్యక్షుడు గంజి రాజమౌళిగుప్తా, తెలంగాణ విభాగం అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తాతో కలసి భావన శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్‌బీనగర్: కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని చైతన్య నగర్ కాలనీలో శనివారం పర్యటించారు. కాలనీ వాసులు వివిధ సమస్యలను కార్పొరేటర్‌కు వివరించారు. ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లోని రోడ్లను ఎప్పటికప్పుడూ శుభ్రం చేయాలని అధికారులకు సూచించారు. కాలనీ అధ్యక్షుడు జలంధర్, మా జీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, నాయకులు పవన్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఈ నరేందర్ తేజ, వాటర్ వర్క్స్ మేనే జర్ రవీందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

29న బధిరుల పాఠశాల ప్రారంభం

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షేమ భవనంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలను (బాలురు) ఈ నెల 29న ప్రారంభిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి వాకాటి కరుణ, దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ హాజరవుతున్నట్లు తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నవర క్షేత్ర శ్రీశ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయ 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పూర నర్సింహగుప్తా తెలిపారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను శనివారం ఆలయంలో ఆవిష్కరించారు.



గుడిసె వాసులకు రెండు నెలల గడువివ్వాలి



గుడిసె వాసులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: జాతీయ రహదారి వెంట నివసిస్తున్న గుడిసె వాసులకు రెండు నెలలు అవకాశమివ్వాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ రేడియో స్టేషన్ సమీపంలో కొన్ని సంవత్సరాలుగా ఉన్న గుడిసెలను జాతీయ రహదారి విస్తీర్ణంలో భాగంగా తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో గుడిసె వాసులు ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. శనివారం వారిని ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ గణపతికి ఫోన్ చేసి మాట్లాడారు. గుడిసె వాసులు కొన్ని సంవత్సరాలుగా అక్కడ నివసిస్తున్నారని, గతంలో మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. అక్కడ 75 కుటుంబాలు నివసిస్తున్నాయని, వినాయక విగ్రహాలను తయారు చేసి జీవనం సాగిస్తున్నారని వివరించారు. మరో రెండు నెలలు వారికి అవకాశం ఇవ్వాలని, లేకపోతే జీవనాధారం దెబ్బతిని ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు రెండు నెలల సమయం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని అధికారి తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, సామ తిరుమల్ రెడ్డి, నాయకులు రవీందర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, భాస్కర్ సాగర్, మల్లీశ్వరి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

హయత్‌నగర్: కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని హయత్‌నగర్ డివిజన్ ఇన్ఫర్మేషన్ కాలనీ వాసులు శనివారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, పూర్తి స్థాయిలో మంచినీటి సౌకర్యం కల్పించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జంగా శ్రీనివాస్, సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు అసౌకర్యం కలగొద్దు



మీ సేవా కేంద్రాల ఆపరేటర్లతో సమావేశమైన తహసీల్దార్ ఎం.జయశ్రీ

సైదాబాద్: మీ సేవా కేంద్రాలకు వచ్చే దరఖాస్తుదారులు అసౌకర్యానికి గురికాకుండా కేంద్రాల ఆపరేటర్లు చర్యలు తీసుకోవాలని సైదాబాద్ తహసీల్దార్ ఎం.జయశ్రీ అన్నారు. శనివారం చంపాపేటలోని మండల కార్యాలయంలో ఆమె మీ సేవా కేంద్రాల ఆపరేటర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మీ సేవా సెంటర్లలో తప్పకుండా సిటిజన్ చార్టర్‌ను ప్రదర్శించడమే కాకుండా అందులోని అంశాలను అనుసరించాలన్నారు. దరఖాస్తుదారులు అందించే అన్ని పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతీనెల 5వ తేదీన మండల పరిధిలోని మీ సేవా కేంద్రాల ఆపరేటర్లతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఆపరేటర్లు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు.

సైదాబాద్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

- మద్యం మత్తులో అపస్మారక స్థితిలోకి
- భయంతో ఫుట్‌పాత్‌పై వదిలివెళ్లిన ఆటో డ్రైవర్
- చికెన్‌ముక్క గొంతులో ఉండటంతో మృతి!



లక్ష్మీనగర్ పార్కు ఫుట్‌పాత్‌పై శ్రీకాంత్ మృతదేహం



మృతుడు శ్రీకాంత్

సైదాబాద్: తెల్లవారుజామున లక్ష్మీనగర్ కాలనీలోని పార్కు వద్ద ఫుట్‌పాత్‌పై వ్యక్తి మృతదేహం ఉండటం స్థానికంగా కలకలం సృష్టించింది. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం ఉదయం కాలనీలోని పార్కు ఫుట్‌పాత్ వద్ద మృతదేహం ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. అందులో శుక్రవారం రాత్రి 11:46 సమయంలో ఆటో నుంచి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని డ్రైవర్ ఫుట్‌పాత్‌పై పడేసి వెళ్లాడు. అనంతరం పోలీసుల విచారణలో మృతుడు రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన రైతు శ్రీకాంత్ (40) గా గుర్తించారు. శుక్రవారం రాత్రి ఊరి నుంచి ఇమ్లీబన్ బస్టాండ్‌కు వచ్చిన శ్రీకాంత్ సమీపంలోని దుకాణంలో మద్యం సేవించి అక్కడే చికెన్ తిన్నాడు. తరువాత ఆటోలో సైదాబాద్ ఇంద్రప్రస్థ కాలనీలోని సోదరి ఇంటికి బయలుదేరాడు. అనంతరం ఇక్కడికి చేరుకున్న తరువాత అతను చిరునామా చెప్పే స్థితిలో లేకపోవడం, అపస్మారకంగా ఉండటాన్ని చూసిన ఆటోడ్రైవర్ భయంతో అతడిని ఫుట్‌పాత్‌పై వదిలి వెళ్లిపోయాడు. మద్యం దుకాణంలో అతను తిన్న చికెన్ గొంతులో ఇరుక్కు పోవడంతో అపస్మారకంలోకి వెళ్లి మృతి చెందినట్లు పోస్టుమార్టం నివేదికలో వచ్చినట్లు తెలుస్తోంది. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అష్టలక్ష్మి ఆలయంలో జ్యేష్ఠమాస పూజలు



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని అష్టలక్ష్మి దేవాలయంలో శనివారం జ్యేష్ఠమాస ప్రత్యేక పూజలు శనివారం ఘనంగా జరిగాయి. అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామి ఆలయంలో 473 రాగి కలశములతో ఉత్తమోత్తమ అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మరిగంటి రాఘవాచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ సోమా సురేశ్, గంప జగన్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, కోశాధికారి అంజయ్యగుప్తా, మాజీ చైర్మన్ సుధాకర్‌గుప్తా, వైస్ చైర్మన్ నాగమల్ల శ్రవణ్‌కుమార్, ఉమాపతి, దాచేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. రుద్రాభిషేకం



శారద చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురంలోని శృంగేరి శంకర మఠంలో శారదా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ 17వ వార్షికోత్సవ పూజలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశారదాంబ అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. శారదా చంద్రమౌళేశ్వర స్వామివారి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం బల్వార్చన, దేవతా హోమం, రుద్ర హోమంతో పాటు వివిధ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శృంగేరి శంకర మఠ బ్రాంచ్ అధికారి కొవ్వడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు అపహరణ.. రిమాండ్

మలక్‌పేట: మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును తెంచుకొని పరారైన స్నాచర్‌ను శనివారం మలక్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిజామాబాద్ ఆర్మూర్‌కు చెందిన సాయి కుమార్(28) భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి దిల్‌సుఖ్‌నగర్ అన్నపూర్ణ కాంప్లెక్స్ వెనుక నివాసం ఉంటున్నాడు. బ్యూటీ పార్లర్‌లో పని చేస్తూ, పార్ట్ టైం జొమాటోలో పని చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడేందుకు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. మంగళవారం రాత్రి విజయమ్మ తన భర్త నర్సింహతో కలిసి ఆనంద్ నగర్ అనితా నర్సింగ్ హోమ్ నుంచి ఇంటికి వెళ్తుంది. ఈ క్రమంలో మలక్‌పేట ముంతాజ్ కళాశాల రోడ్డులో ఆమె మెడలోని బంగారు మంగళసూత్రం లాక్కొని పారిపోయాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. దిల్‌సుఖ్‌నగర్ శ్రీనగర్ కాలనీలో యాక్టివా ఆగి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

చనిపోయిన వ్యక్తిపై అప్పు సృష్టించారని ఫిర్యాదు

చంచల్‌గూడ: నాలుగేళ్ల క్రితం చనిపోయిన వ్యక్తి పేరుతో అప్పు పత్రం సృష్టించారని బాధితుడు మాదన్నపేట పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కుర్మగూడ డివిజన్‌లో నివాసముండే విశ్రాంత ఉద్యోగి బందర్ విజయ్‌కుమార్‌కు ముగ్గురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. ఆయన చిన్న సోదరుడు బందర్ రవీందర్ అలియాస్ సత్యనారాయణ 2021లో అనారోగ్యంతో మృతి చెందాడు. ఇదిలా ఉండగా.. సత్యనారాయణ ఇంటి పత్రాలు పెట్టి తమ వద్ద రూ.25 లక్షలు అప్పు తీసుకున్నాడని గోషామహల్‌కు చెందిన ఎం.సంతోష్‌కుమార్, కె.పశుపతి, డి.అర్జున్‌కుమార్, ఎం.వెంకటేశ్‌లు తాజాగా నోటీసులు పంపారు. దీంతో ఆశ్చర్యానికి గురైన బాధితుడు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన సోదరుడు సత్యనారాయణ అనారోగ్యంతో ఉన్నప్పుడు సోదరి కుమారుడు ప్రవీణ్‌కుమార్ తరచుగా రాకపోకలు సాగిస్తుండే వాడని, ఇంటి పత్రాలు దొంగిలించి అప్పు పత్రాల పేరుతో కుట్ర పన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ అంశంపై పూర్తి విచారణ చేసి నిజానిజాలు బయటకు తీయాలని బాధితుడు పోలీసులను కోరారు.

సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలి



మురుగును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: జీహెచ్‌ఎంసీ, జలమండలి, సివరేజ్ బోర్డు అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ పరిధి సహారాస్టేట్స్ కాలనీలో 10 బ్లాక్ వద్ద డ్రైనేజీ మురుగు ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జడ్జెస్ కాలనీ నుంచి సహారాస్టేట్స్, ఆటోనగర్ రోడ్డు వరకు బాక్స్ డ్రెయిన్ నాలాలోని డ్రైనేజీ మురుగు రావడంతో తీవ్ర దుర్వాసనతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సహారాస్టేట్స్‌కాలనీ వెనుకవైపు ఆటోనగర్ రోడ్డులో బాక్స్ డ్రెయిన్ నాలా పనులు పూర్తికాకపోవడమే కాకుండా ఆటోనగర్ డంపింగ్‌యార్డ్ నుంచి వరద కాలువ నీటిని ఈ జంక్షన్‌లో కలపడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. హిమపురికాలనీ మీదుగా రూ.6.80 కోట్లతో చేపట్టనున్న వరద కాలువ పనులు త్వరగా మొదలయ్యే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సహారాస్టేట్స్‌కాలనీ మెయింటనెన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, నాయకులు రవిచంద్ర, రాఘవేందర్, అమరనాథ్, విజయలక్ష్మి, రామన్‌గౌడ్, రాఖేశ్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఏలు లక్ష్మణ్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.



చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. చెత్తతో వినియోగదారులకు, రైతులకు, వ్యాపారస్తులకు దుర్గంధం వెదజల్లుతుంది. రాష్ట్రంలోనే పెద్దమార్కెట్‌గా పేరొందిన వ్యవసాయ మార్కెట్‌లో చెత్తకుప్పలు దర్శనం ఇవ్వటం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

> **దుర్గంధంతో ఇబ్బందులు**
>
> 
>
> మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తతో దుర్గంధం వెదజల్లుతుంది. పెద్ద మార్కెట్‌ను శుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చూడాలి.
>
> –కె.రాజశేఖర్‌రెడ్డి, ఓల్డ్‌మలక్‌పేట స్థానికుడు